సాక్షి
అనకాపల్లి
శుక్రవారం । 2 । జూన్ । 2023



'జూనియర్' సందడి..!

జూనియర్ కళాశాలలు తెరుచుకున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు కాలేజీల బాట పట్టారు. 8లో



ప్రసాద్ స్కీమ్ బుక్‌లెట్

సింహాచలంలో ప్రసాద్ స్కీమ్ బుక్‌లెట్‌ను స్వరూపానందేంద్ర సరస్వతి స్వామి ఆవిష్కరించారు. 8లో



వీర్ కశ్యప్‌కు నేవీ సత్కారం

విశాఖ: ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్ అందుకున్న నేవీ స్కూల్ విద్యార్థి వీర్ కశ్యప్‌ను నేవీ చీఫ్ హరికుమార్ సత్కరించారు.

'వర్ష' బేస్ గెట్ రెడీ

- రాంబిల్లి వద్ద సాగరతీర అంతర్భాగంలో సీక్రెట్ న్యూక్లియర్ సబ్‌మెరైన్ బేస్ నిర్మాణం
- ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి వచ్చే అవకాశం
- ఒకే సారి 12 సబ్‌మెరైన్లు ఉంచేలా ఏర్పాటు



రాంబిల్లి వద్ద ఐఎన్ఎస్ వర్ష నేవల్ బేస్ నిర్మితమవుతున్న ప్రాంతం

సాక్షి, విశాఖపట్నం: దేశానికి వ్యూహాత్మక రక్షణ ప్రాంతంగా.. సహజ సిద్ధమైన భౌగోళిక రక్షణతో పాటు శత్రుదేశాలకు సుదూరంగా ఉండటం తూర్పు నౌకాదళం ప్రత్యేకత. పెరుగుతున్న నౌకాదళ సంపత్తికి అనుగుణంగా.. విభిన్న స్థావరాలను ఏర్పాటు చేసుకుంటున్న ఈఎన్‌సీ.. ప్రత్యామ్నాయ బేస్‌గా అతి రహస్య స్థావరాన్ని సిద్ధం చేసుకుంటోంది. అత్యంత శక్తిమంతమైన అణు జలాంతర్గాములను సాగర గర్భంలోనే ఉంచేలా..విశాఖ శివారు రాంబిల్లిలో నిర్మిస్తున్న ఐఎన్ఎస్ వర్ష ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానుంది.

ఈఎన్‌సీకి చెందిన స్థావరాలు మొత్తం 15 ఉండగా ఇందులో ఏడు నేవల్ బేస్‌లు విశాఖలోనే ఉన్నాయి. దీనికి తోడుగా రాంబిల్లిలో కొత్త నేవల్ బేస్ ఐఎన్ఎస్ వర్ష నిర్మితమవుతోంది. ఇది మిగిలిన స్థావరాలతో పోలిస్తే పూర్తిగా భిన్నమైనది. వర్ష వంటి భూగర్భ నౌకా స్థావరాలు కొత్తవి కాదు. రష్యా, చైనా.. తన జలాంతర్గాములను ఆపరేట్ చేయడానికి ఈ తరహా అండర్ గ్రౌండ్ స్థావరాలను నిర్మించుకున్నాయి. అదేవిధంగా.. భారత నౌకాదళానికి కూడా రహస్య స్థావరం ఉండాలనే ఉద్దేశంతో ఐఎన్ఎస్ వర్షను నిర్మిస్తున్నారు. తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రానికి 50 కి.మీ దూరంలో ఉన్న రాంబిల్లిలో దీన్ని నిర్మిస్తున్నారు. మొత్తం 670 హెక్టార్ల విస్తీర్ణంలో టన్నెల్స్ రూపంలో ఇది సిద్ధమవుతోంది.

ప్రస్తుతం ఈఎన్‌సీ ప్రధాన కేంద్రంలోనే యుద్ధ నౌకలు, సబ్‌మెరైన్లను ఉంచుతున్నారు. విశాఖ పోర్టు కూడా సమీపంలో ఉండటంతో కార్గో నౌకలు, కంటైనర్ నౌకలతో నిరంతరం రద్దీగా ఉంటోంది. భద్రత దృష్ట్యా మరో రహస్య స్థావరం కోసం వర్షను నిర్మిస్తున్నారు. అణు జలాంతర్గాములు దేశ నౌకాదళంలో అత్యంత కీలకమైనవి. వీటి రాకపోకలను అత్యంత గోప్యంగా ఉంచడం చాలా ముఖ్యం. ఐఎన్ఎస్ అరిహంత్ వంటి న్యూక్లియర్ సబ్‌మెరైన్లు నెలల తరబడి సముద్ర గర్భంలో విధి నిర్వహణలో ఉంటాయి. 200 మీటర్ల లోతులో నిశ్శబ్దంగా కదులుతున్నట్లు గుర్తించడం, ట్రాక్ చేయడం దాదాపు అసాధ్యం. అయితే ఇవి పోర్టు సమీపంలో లంగరు వేసినప్పుడు శత్రు గూఢచారి శాటిలైట్స్ సులభంగా గుర్తించగలవు. వీటి సమాచార గోప్యత కోసం ఐఎన్ఎస్ వర్ష ఉపయోగపడుతుంది.

దేశ రక్షణకు కీలక స్థావరం

ఐఎన్ఎస్ వర్షలో ఐదు టన్నెల్స్ ఏర్పాటు చేస్తున్నారు. ఈ సొరంగాల ద్వారా సబ్‌మెరైన్లు స్థావరంలోకి రాకపోకలు సాగిస్తుంటాయి. కాబట్టి జలాంతర్గాములు ఉపరితలంపైకి రావాల్సిన అవసరం లేదు. అందువల్ల శత్రువులు వీటి జాడని కనిపెట్టలేరు. వర్ష బేస్‌లో సిబ్బంది విశ్రాంతి సౌకర్యాలు, మరమ్మతులు, నిర్వహణకు అనువుగా భవనాలు నిర్మించారు. మొత్తం 12 న్యూక్లియర్ సబ్‌మెరైన్లు ఒకే కాలంలో అండర్ గ్రౌండ్‌లో ఉండేలా ఏర్పాట్లు చేశారు. అంతే కాకుండా డీజిల్, ఎలక్ట్రిక్ సబ్‌మెరైన్లను కూడా ఇక్కడి నుంచే ఆపరేట్ చేయగల సామర్థ్యం ఉంది. శత్రుమూకలు అణు దాడి చేసినా.. వాటి నుంచి సురక్షితంగా ఉండేలా ఐఎన్ఎస్ వర్ష నిర్మాణం జరుగుతోంది. సబ్‌మెరైన్లలో అణు రియాక్టర్ల నిర్మాణం, అమర్చడం కూడా ఇక్కడ జరగనుంది. నీటి అడుగున స్థావరం వద్ద మిస్సైల్ టెక్నికల్ పొజిషన్స్ అనే ఆయుధ నిల్వ సౌకర్యం కూడా ఉంది. మొత్తంగా దేశ రక్షణకు కీలక స్థావరంగా ఐఎన్ఎస్ వర్ష సన్నద్ధమవుతోంది. కోవిడ్ కారణంగా పనులు ఆలస్యమయ్యాయని.. ఈ ఏడాది చివరి నాటికి ఇది అందుబాటులోకి వచ్చే అవకాశాలున్నట్లు భారత నౌకాదళాధిపతి అడ్మిరల్ హరికుమార్ స్పష్టం చేశారు.



అండర్ గ్రౌండ్‌లో సబ్‌మెరైన్లు ఉంటాయిలా..

అత్యాధునికంగా నేవల్ బేస్



రాంబిల్లిలో నిర్మితమవుతున్న నేవల్ ఆల్టర్నేటివ్ ఆపరేషనల్ బేస్(ఎన్ఏవోబీ) పనులు చురుగ్గా సాగుతున్నాయి. వీలైనంత త్వరగా దీన్ని అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తున్నాం. తూర్పు తీరంలో ఆరు లక్షల చ.కి.మీ పరిధిలో ఎక్స్‌క్లూజివ్ ఎకనమిక్ జోన్‌తో పాటు మేజర్ పోర్టులున్నాయి. సముద్ర వాణిజ్యానికి తూర్పు తీరం ప్రధాన కేంద్రంగా మారడంతో వాణిజ్య నౌకల రక్షణ బాధ్యత కూడా తూర్పు నౌకాదళమే చూస్తోంది. దీంతో పాటు డీఆర్‌డీవో కార్యకలాపాలకు కూడా విశాఖ వేదికగా మారింది. పలు క్షిపణులు తయారు చేసే ఎన్ఎస్టీఎల్ కూడా ఇక్కడే ఉంది. ఎప్పటికప్పుడు నౌకా సంపత్తిని పెంచుకుంటూ శత్రుదుర్భేద్యంగా మారుతున్న నేపథ్యంలో ఈ అత్యాధునిక నేవల్ బేస్ సిద్ధం చేస్తున్నాం. అరిహంత్ క్లాస్ సబ్‌మెరైన్లతో పాటు ఎస్ 5, న్యూక్లియర్ ఎటాక్ సబ్‌మెరైన్లను కూడా ఇక్కడ ఉంచేలా నిర్మిస్తున్నాం.

– అడ్మిరల్ హరికుమార్, భారత నౌకాదళాధిపతి

న్యూస్‌రీల్

శ్రీవారి సన్నిధిలో హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి



శ్రీవారిని దర్శించుకున్న జస్టిస్ శేషసాయి

కొమ్మాది/దాబాగార్డెన్స్: రుషికొండలో కొలువైన మహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీ వేంకటేశ్వరస్వామిని గురువారం హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి దర్శించుకున్నారు. అంతరాలయంలో శ్రీవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ సూపరింటెండెంట్ వెంకటరమణ, ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ రాజు ఆయనకు స్వామి ప్రసాదం అందజేశారు. బురుజుపేటలో కొలువై ఉన్న కనకమహాలక్ష్మిని పలువురు ప్రముఖులు గురువారం దర్శించుకున్నారు. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ఎ.వి.శేషసాయి, జిల్లా ప్రధాన న్యాయమూర్తి ఎ.గిరిధర్, ప్రోటోకాల్ జిల్లా సీనియర్ న్యాయమూర్తి వై.యుగంధర్, న్యాయమూర్తి శ్రీధర్ అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ సంప్రదాయం ప్రకారం స్వాగతం పలికి వీరిచే అమ్మవారికి విశేష పూజలు నిర్వహించారు. వేద ఆశీర్వచనం అనంతరం అమ్మవారి ప్రసాదం అందజేశారు. ఈవో కె.శిరీష, ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ కొల్లి సింహాచలం, ఏఈవోలు కె.తిరుమలేశ్వరరావు, వెంపలి రాంబాబు, ధర్మకర్తలు అశోక్‌కుమార్, సతీష్ పాల్గొన్నారు.

బాల కార్మికుల కోసం స్పెషల్ డ్రైవ్



అసిస్టెంట్ లేబర్ ఆఫీసర్ మునిస్వామి

అనకాపల్లి టౌన్: జిల్లా సహాయ కార్మికశాఖ అధికారిగా బుద్ధ మునిస్వామి గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఏడాదిపాటు ఈ పోస్టు ఖాళీగా ఉంది. బాధ్యతలు స్వీకరించిన అనంతరం మునిస్వామి మాట్లాడుతూ జిల్లా అంతటా బాలకార్మికుల కోసం ఈనెల 30వ తేదీ వరకు ప్రత్యేక తనిఖీలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. కార్మిక, ఐసీడీఎస్, ఎన్జీవోఎస్ స్వచ్ఛంద సంస్థ, పోలీస్, చైల్డ్‌లైన్ శాఖ ఆధ్వర్యంలో తనిఖీలు నిర్వహిస్తున్నట్లు ఆయన చెప్పారు. దుకాణాలు, ఫ్యాక్టరీల్లో బాలకార్మికులతో పని చేయించరాదని పేర్కొన్నారు.

నూకాంబిక హుండీ ఆదాయం రూ.59.50 లక్షలు



హుండీలెక్కిస్తున్న ఆలయ అధికారులు, సిబ్బంది

అనకాపల్లిటౌన్: స్థానిక గవరపాలెం నూకాంబిక ఆలయంలో గురువారం అమ్మవారి హుండీ లెక్కింపు జరిగింది. అమ్మవారి హుండీ ద్వారా ఏప్రిల్ 12 నుంచి మే 31 వరకు 50 రోజులకుగాను నగదు రూ.59 లక్షల, 50 వేల, 644తోపాటు, 26 గ్రాముల బంగారం, కేజీ వెండి లభించినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి బండారు ప్రసాద్ వెల్లడించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

6న మోదమాంబ పండగ

నేటి నుంచి వారం రోజులు సురభి నాటకాలు



మోదకొండమ్మ తల్లికి నగలతో అలంకరణ

మాడుగుల: ఉత్తరాంధ్ర ఇలవేల్పు మాడుగుల మోదకొండమ్మ పండగ ఈ నెల 6న అత్యంత వైభవంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని ఆలయ కమిటీ చైర్మన్ పుప్పాల అప్పలరాజు గురువారం తెలిపారు. శుక్రవారం నుంచి స్థానిక మహారాజుల కోటలో ప్రసిద్ధ సురభి నాటకాలు వారం రోజుల పాటు ప్రదర్శించనున్నట్టు పేర్కొన్నారు. మోదమాంబ ఆలయం నుంచి సతకం పట్టు వరకు కళ్లు మిరిమిట్లు గొలిపేలా విద్యుత్ లైటింగ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. పండగ రోజు వివిధ ప్రాంతాలు నుంచి తీసుకొచ్చే కళాకారులుతో చిత్ర విచిత్రమైన నేల వేషాలు, గిరిజన సంప్రదాయ థింసా నృత్యం ఉంటాయన్నారు. భక్తులు అమ్మవారిని దర్శించుకోవడానికి ఇబ్బందుల్లేకుండా ప్రత్యేక క్యూలైన్లను ఏర్పాటు చేస్తామన్నారు.

టెన్త్ సప్లిమెంటరీ పరీక్షలకు సర్వం సిద్ధం



పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న అధికారులు

సాక్షి, అనకాపల్లి: పదో తరగతి సప్లిమెంటరీ (అడ్వాన్స్‌డ్) పరీక్షలకు జిల్లా విద్యాశాఖాధికారులు సర్వం సిద్ధం చేశారు. ప్రతీ రోజూ ఉదయం 9.30 నుంచి మధ్యాహ్నం 12.45 గంటల వరకు పరీక్షలు జరగనున్నాయి. జిల్లాలో 4,930 మంది విద్యార్థులు హాజరుకానున్నారు. వీరి కోసం 21 కేంద్రాలను ఏర్పాటు చేశారు. హాల్ టికెట్‌తో విద్యార్థులు ఆర్టీసీ బస్సుల్లో ఉచితంగా పరీక్ష కేంద్రాల వరకు చేరుకోవచ్చు. ఎటువంటి అవాంఛనీయ ఘటనలు చోటుచేసుకోకుండా పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేస్తున్నారు. పరీక్షలు ప్రశాంతంగా ముగిసేలా డీఈవో వెంకటలక్ష్మమ్మ అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఆమె పరీక్ష కేంద్రాల్లో ఏర్పాట్లను పరిశీలించారు.

నూకాంబిక ఆలయ ఈవోగా అన్నపూర్ణ

అనకాపల్లి టౌన్: గవరపాలెం నూకాంబిక అమ్మవారి ఆలయ కార్యనిర్వహణాధికారిగా టి.అన్నపూర్ణ నియమితులయ్యారు. ఆమె ఎన్టీఆర్ జిల్లా నుంచి బదిలీపై వస్తున్నారు. ప్రస్తుతం తాత్కాలికంగా ఈవో బాధ్యతలు చూస్తున్న బండారు ప్రసాద్ విశాఖలోని వైభవ వేంకటేశ్వరస్వామి ఆలయం ఈవోగా కొనసాగుతారు. నూకాంబిక ఆలయ గత ఈవో చంద్రశేఖర్‌ను శ్రీకాకుళం జిల్లా సహాయ కమిషనర్‌గా నియమించారు. మునగపాకలోని శ్రీ పాలేశ్వర, భీమేశ్వరాలయం ఈవో పి.ఎస్.నారాయణమూర్తికి ఆ ఆలయం బాధ్యతలతోపాటు విశాఖ అయ్యప్పనగర్‌లోని భూ సమేత వేంకటేశ్వరస్వామి దేవస్థానం ఈవో బాధ్యతలు అప్పగించారు.

2,59,549 మందికి రైతు భరోసా



రైతులకు నమూనా చెక్కును పంపిణీ చేస్తున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి, ఎంపీ సత్యవతి

బ్యాంకు ఖాతాల్లో రూ.194.79 కోట్లు జమ

అనకాపల్లి టౌన్: దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్రంలో రైతు భరోసా కేంద్రాలు ఏర్పాటు చేసి ప్రభుత్వం అన్నదాతలకు బాసటగా నిలుస్తోందని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. వరుసగా ఐదో ఏడాది మొదటి విడతగా రైతుల ఖాతాల్లో వైఎస్సార్ రైతు భరోసా, పీఎం కిసాన్ సొమ్మును జమ చేసినట్లు ఆయన చెప్పారు. స్థానిక గుండాల జంక్షన్‌లోని జీవీఎంసీ కల్యాణ మండపం మేడపైన గురువారం జరిగిన కార్యక్రమంలో ఎంపీ డాక్టర్ బి.వి.సత్యవతితో కలిసి ఆయన జిల్లాలోని 2,59,549మంది రైతులకు లబ్ధి చేకూర్చే రూ.194.79 కోట్ల నమూనా చెక్కును లబ్ధిదారులకు అందజేశారు. కర్నూలు జిల్లా పత్తికొండలో సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రసంగాన్ని డిజిటల్ స్క్రీన్‌పై వారు తిలకించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రైతుకు వెన్నుదన్నుగా నిలిచేందుకు ప్రభుత్వం రైతు భరోసా పెట్టుబడి సాయం అందిస్తోందని చెప్పారు.

ఎంపీ సత్యవతి మాట్లాడుతూ ఆర్బీకేల ద్వారా రైతులకు తగు సూచనలు, సలహాలు, భూ విత్తన పరీక్షలు అందించి వ్యవసాయాన్ని లాభసాటిగా నిలిపేలా ప్రత్యేకమైన కృషి చేస్తున్నట్లు తెలిపారు. మార్చి, ఏప్రిల్, మే మాసాల్లో అకాల వర్షాలకు పంట నష్టపోయిన 698మంది రైతులకు ఇన్‌పుట్ సబ్సిడీగా రూ.12.89 లక్షలు విడుదల చేసినట్లు చెప్పారు. వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ పలకా యశోద, జిల్లా వ్యవసాయశాఖ జేడీ మోహన్‌రావు, జిల్లా హార్టికల్చర్ అధికారి ప్రభాకరరావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి దంతులూరి దిలీప్‌కుమార్, వ్యవసాయశాఖ అధికారులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.

బడి తెరిచిన రోజే విద్యా కానుక

గత ప్రభుత్వాల్లో పాఠ్యపుస్తకాల కోసం నిరీక్షణ అంతులేనిది. ఇపుడు రోజులు మారాయి. జగన్ మామయ్య ప్రభుత్వంలో తమకు ఎదురుచూపులతో పనిలేదని విద్యార్థుల ధీమా. వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచే సమయానికి విద్యార్థులకు జగనన్న విద్యాకానుకను అందించేందుకు విద్యాశాఖ సిద్ధమయింది. ఇప్పటికే ఆయా విద్యాసంస్థల నుంచి వచ్చిన ఇండెంట్ల మేరకు వస్తువులను మండల కేంద్రాలకు చేరవేశారు.

- ఇప్పటికే మండల కేంద్రాలకు చేరిన కిట్లు
- జిల్లాలో 1,20,284 మంది విద్యార్థులకు లబ్ధి
- ఈసారి మూడు జతల యూనిఫామ్

సాక్షి, అనకాపల్లి: మరో పది రోజుల్లో స్కూళ్లు తెరుచుకోనున్నాయి. జిల్లాలోని లక్షా 20 వేల 284 మంది విద్యార్థులకు తొలి రోజే విద్యాకానుకను అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక విద్యారంగానికి అధిక ప్రాధాన్యమిస్తున్న విషయం తెలిసిందే. అమ్మఒడి, నాడు–నేడు, జగనన్న విద్యాదీవెన, జగనన్న వసతి దీవెన వంటి పథకాలతో పాటుగా జగనన్న విద్యా కానుక విద్యార్థులకు ఎంతో ప్రయోజనంగా మారింది.



సబ్బవరం ఉన్నత పాఠశాలలో జగనన్న విద్యా కానుక కిట్ క్వాలిటీ వాల్ (ఫైల్)

నాణ్యతలో రాజీలేదు

చదువుకు అవసరమైన వస్తువులను ఉచితంగా అందించేలా ప్రభుత్వం ప్రత్యేకంగా శ్రద్ధ చూపుతోంది. ప్రభుత్వ పాఠశాలల్లో అడ్మిషన్ తీసుకునే ప్రతి విద్యార్థికి అందించే జగనన్న విద్యాకానుకలోని 8 రకాల వస్తువుల నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా అధికారులు కసరత్తు చేశారు. యూనిఫామ్, పుస్తకాలు, బూట్లు, బ్యాగ్, బెల్టు తదితర వస్తువుల నాణ్యతపై ప్రత్యేక దృష్టి సారించారు. మూడు జతల యూనిఫామ్, పాఠ్యపుస్తకాలు, నోట్ పుస్తకాలు, ఇంగ్లిష్ డిక్షనరీ, బెల్ట్, బూట్లు, రెండు జతల సాక్స్, ఓ బ్యాగ్‌లో పెట్టి విద్యార్థులందరికీ అందించనున్నారు.

మండల కమిటీల పర్యవేక్షణ

మండల కేంద్రాల్లో స్టాక్ పాయింట్లలో జగనన్న కిట్లకు సంబంధించి అన్ని వస్తువులు వచ్చాయా? అవన్నీ నాణ్యత కలిగి ఉన్నాయా? అనే అంశాల పరిశీలనకు మండల విద్యాశాఖ అధికారి ఆధ్వర్యంలో ముగ్గురు హెడ్ మాస్టర్లను సభ్యులుగా మండలాల వారీగా కమిటీలను ఏర్పాటు చేశారు. వీరు ఎప్పటికప్పుడు తమ పరిధిలోని స్కూళ్లకు సరిపడా కిట్లు సిద్ధం చేయడంలో బిజీగా ఉన్నారు. వీటిపై వివరాలను జిల్లా విద్యాశాఖాధికారికి చేరవేసి, రావాల్సిన వాటిని కూడా పూర్తి స్థాయిలో రప్పించుకుంటున్నారు.

తొలి రోజే కిట్ల అందజేత



జిల్లాలోని 24 మండలాల్లో ఉన్న స్కూళ్లకు పూర్తి స్థాయిలో జగనన్న విద్యాకానుకలను సిద్ధం చేశాం. వాటిని జూన్ రెండో తేదీ నుంచి ఆయా స్థానిక విద్యాసంస్థలకు చేరవేసేందుకు ప్రణాళికాబద్ధంగా చర్యలు తీసుకున్నాం. పాఠశాలలు తెరిచే సమయానికి పూర్తి స్థాయిలో వస్తువులను అందించేలా చూసుకున్నాం. తొలి రోజే శతశాతం విద్యార్థులు జగనన్న విద్యాకానుక అందుకునేలా ఏర్పాట్లు చేస్తున్నాం.

–వెంకటలక్ష్మమ్మ, జిల్లా విద్యాశాఖాధికారి

మలేరియా నివారణ మాసోత్సవాలు ప్రారంభం



ర్యాలీలో పాల్గొన్న జిల్లా మలేరియా శాఖ అధికారి దొర

అనకాపల్లి టౌన్: వర్షాకాలంలో ప్రజలు దోమల బారిన పడకుండా ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు జిల్లా మలేరియా శాఖ అధికారి కె.దొర చెప్పారు. మలేరియా నివారణ మాసోత్సవాలను గురువారం ప్రారంభించి పట్టణంలో రైల్వే స్టేషన్, భీమునిగుమ్మం, గూడ్స్‌రోడ్డు, మళ్లవీధిలో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈనెల 30 వరకు జిల్లాలోని వివిధ ప్రాంతాల్లో మలేరియా వ్యాధులపై అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నిలువ నీటితో దోమలు వృద్ధి చెందుతాయని, ఇంటి పూలకుండీల్లో నీరు నిల్వ లేకుండా జాగ్రత్త పడాలని కోరారు. జ్వరం వచ్చిన వెంటనే ఆశా, ఆరోగ్య కార్యకర్తలకు సమాచారం ఇచ్చి, ఆరోగ్య కేంద్రాల వద్ద మలేరియా నిర్ధారణ పరీక్ష చేయించుకోవాలని ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి మలేరియా ఇన్‌స్పెక్టర్ చవ్వాకుల గణేష్, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ చీఫ్ సిటీ ప్లానర్‌గా సునీత

దాబాగార్డెన్స్ (విశాఖ): జీవీఎంసీ ప్రధాన పట్టణ ప్రణాళికాధికారిగా సునీత నియమితులయ్యారు. ఈ మేరకు మున్సిపల్, పట్టణాభివృద్ధి శాఖ ప్రధాన కార్యదర్శి వై.శ్రీలక్ష్మీ ఉత్తర్వులు జారీ చేశారు. డీటీసీపీ(డైరెక్టర్ టౌన్ అండ్ ప్లానింగ్)లో అదనపు సంచాలకులుగా పని చేస్తున్న సునీత.. గతంలో డీసీపీగా కూడా పనిచేశారు.

విద్యాశాఖలో బదిలీలు

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలోని విద్యాశాఖలో పలువురు అధికారులు, ఉద్యోగులు బదిలీ అయ్యారు. సాధారణ బదిలీల్లో భాగంగా విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల పరిధిలోని అధికారులు, ఉద్యోగుల్లో దీర్ఘకాలంగా పనిచేస్తున్న వారికి స్థానచలనం కల్పించారు. విశాఖ డీఈవో కార్యాలయంలోని సూపరింటెండెంట్ జగన్నాథంను అనకాపల్లి జిల్లా సమగ్ర శిక్ష కార్యాలయానికి బదిలీ చేశారు. అక్కడ పని చేస్తున్న సుందర్‌సింగ్ విశాఖకు బదిలీ అయ్యారు. వీరితో పాటు ఉమ్మడి విశాఖపట్నం జిల్లాలోని విద్యాశాఖలో పలువురు ఉద్యోగులకు బదిలీలు జరిగాయి.

సింహగిరిపై నృసింహ జయంతి రేపు

సింహాచలం: సింహగిరిపై శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఆలయంలో శనివారం శ్రీనృసింహ జయంతిని ఘనంగా నిర్వహించనున్నట్లు ఆలయ ఏఈవో శ్రీనివాసరావు తెలిపారు. సాయంత్రం 4 గంటల నుంచి నృసింహ జయంతి పూజలు జరుగుతాయని, అప్పటి నుంచి భక్తులకు అప్పన్న దర్శనం ఉండదన్నారు. తిరిగి 4వ తేదీ ఉదయం 7 గంటల నుంచి దర్శనాలు లభిస్తాయని తెలిపారు. 3న సాయంత్రం శ్రీకృష్ణాపురంలోని గోశాలలో ఉన్న నృసింహుడి విగ్రహం చెంతన కూడా నృసింహ జయంతి పూజలు నిర్వహిస్తామన్నారు.

పలువురు ఎంపీడీవోలకు పోస్టింగ్‌లు

మహారాణిపేట (విశాఖ): ఉమ్మడి విశాఖ జిల్లాలో ఖాళీగా ఉన్న స్థానాల్లో మండల ప్రజా పరిషత్ అధికారులను నియమించారు. ఈ మేరకు జిల్లా పరిషత్ సీఈవో శ్రీరామ్మూర్తి ఉత్తర్వులు జారీ చేశారు. ఇటీవల పది మంది జిల్లా పరిషత్ పరిపాలన అధికారులు (ఏవోలు), ఈపీఆర్‌డీవోలకు ప్రభుత్వం ఎంపీడీవోలుగా పదోన్నతులు కల్పించిన సంగతి తెలిసిందే. ఈ పది మందికి కేటాయించిన స్థానాల్లో తక్షణమే విధుల్లో చేరాలని జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జె.సుభద్ర కోరారు.

పేరు	ప్రస్తుత స్థానం	నియమించిన స్థానం
కె.వసంత	ఏవో, ఎస్.రాయవరం	పెందుర్తి
కె.వి.నరసింహారావు	ఏవో, పాడేరు	అనకాపల్లి
ఉషారాణి	ఈవోఆర్‌డీ పద్మనాభం	డుంబ్రిగుడ
ఆశాజ్యోతి	ఏవో	చింతపల్లి
హరిహరరావు	ఈవోఆర్‌డీ, శ్రీకాకుళం	నాతావరం
బి.వి.రవికుమార్	ఈవోఆర్‌డీ, శ్రీకాకుళం	కశింకోట
మన్మథరావు	ఏవో, శ్రీకాకుళం	మునగపాక
అప్పలనాయుడు	ఏవో, శ్రీకాకుళం	యలమంచిలి
కాశీ విశ్వనాథరాజు	ఏవో, శ్రీకాకుళం	కోటవురట్ల
శ్రీనివాస్	ఏవో, తూ.గో.జిల్లా	నక్కపల్లి

'బ్రాండిక్స్' బస్సులు ఢీ

పది మందికి పైగా గాయాలు



చికిత్స పొందుతున్న బ్రాండిక్స్ కార్మికురాలు

అచ్యుతాపురం (అనకాపల్లి): బ్రాండిక్స్ ఆవరణలో పనులు ముగించుకొని ఇళ్లకు వెళుతున్న కార్మికుల బస్సులు పరస్పరం ఢీకొనడంతో పది మందికి పైగా గాయపడ్డారు. గురువారం జరిగిన ఈ ఘటనతో కార్మికులు ఆందోళనకు గురయ్యారు. గాయపడిన సత్య, కుమారి, రామలక్ష్మి, ధన, నాగలక్ష్మి, దేవి తదితరులను స్థానిక ఆస్పత్రికి తరలించి చికిత్స అందించారు. ఒక బస్సు బ్రేక్ ఫెయిల్ అవ్వడం వల్లే ఈ ప్రమాదం సంభవించినట్టు ప్రాథమికంగా నిర్ధారించారు. బాధితులకు మెరుగైన చికిత్స అందించాలని, వేతనంతో కూడిన సెలవులు మంజూరు చేయాలని సీఐటీయూ నాయకుడు ఆర్.రాము డిమాండ్ చేశారు.

'జూనియర్' సందడి..!

- తెరుచుకున్న జూనియర్ కాలేజీలు
- ఇంటర్మీడియట్ తరగతులు ప్రారంభం
- ప్రభుత్వ కాలేజీల్లో అడ్మిషన్ల జోరు
- 'నాడు – నేడు'తో మెరుగైన వసతులు



అడ్మిషన్ల కోసం కాలేజీకి వచ్చిన విద్యార్థినులు

విశాఖ విద్య: ఉమ్మడి విశాఖ జిల్లాలో జూనియర్ కాలేజీలు గురువారం తెరుచుకున్నాయి. వేసవి సెలవులు ముగియడంతో విద్యార్థులు కాలేజీల బాట పట్టారు. తొలిరోజు కాలేజీల్లో అడ్మిషన్ల సందడి కనిపించింది. సప్లిమెంటరీ పరీక్షలు గురువారంతో ముగియడంతో శుక్రవారం నుంచి తరగతులను సైతం ప్రారంభించేందుకు కాలేజీల నిర్వాహకులు సిద్ధమయ్యారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వ, ప్రైవేటు కాలేజీల్లో 2023 – 24 విద్యా సంవత్సరానికి అడ్మిషన్లు ఊపందుకున్నాయి. ఇంటర్మీడియట్ చదువుల ప్రాధాన్యత దృష్ట్యా వార్షిక విద్యా క్యాలెండర్‌ను ప్రభుత్వం ఈ సారి ముందుగానే ప్రకటించింది. జూనియర్ కాలేజీల్లో చదువులు సవ్యంగా సాగేలా ఇంటర్మీడియట్ బోర్డు ఉన్నతాధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. వార్షిక విద్యా క్యాలెండర్ పక్కాగా అమలుపై ఫోకస్ పెట్టారు.

ఉమ్మడి జిల్లాలో ఇలా..

విశాఖపట్నం, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల్లో ప్రభుత్వ జూనియర్ కాలేజీలు 39 ఉన్నాయి. సోషల్ వెల్ఫేర్ – 11, ట్రైబర్ వెల్ఫేర్ – 10, కేజీబీవీ – 34, బీసీ వెల్ఫేర్ – 2, మోడల్ జూనియర్ కాలేజీలు – 5, హైస్కూల్ ప్లస్ 2 – 10, ప్రైవేటు యాజమాన్యాల పరిధిలో 271 కాలేజీలు ఉన్నాయి. వీటి పరిధిలో 2022 – 23 విద్యా సంవత్సరంలో మొదటి, రెండో సంవత్సరం విద్యార్థులు కలిపి 92,895 మంది విద్యనభ్యసించారు. ఈ ఏడాది మొదటి సంవత్సరంలో 50 వేలకు పైగానే ప్రవేశాలు పొందే అవకాశం ఉంటుందని అధికారులు భావిస్తున్నారు. ఇందుకు అనుగుణంగా కాలేజీల్లో అడ్మిషన్లపై ఫోకస్ పెట్టారు.

పక్కాగా విద్యా క్యాలెండర్

2023 – 24 విద్యా సంవత్సరంలో 227 రోజులు కాలేజీలు పనిచేసేలా వార్షిక విద్యా క్యాలెండర్‌ను ఇంటర్మీడియట్ బోర్డు అధికారులు ప్రకటించారు. ఈ మేరకు గురువారం నుంచి జూనియర్ కాలేజీలు తెరుచుకున్నాయి. విద్యా క్యాలెండర్ మేరకు తరగతుల నిర్వహణపై దృష్టి సారించారు. ఇందులో భాగంగా జూలై 26 నుంచి 28 వరకు ఫస్ట్ యూనిట్, ఆగస్టు 24 నుంచి 26 వరకు సెకండ్ యూనిట్ పరీక్షలు నిర్వహించనున్నారు. క్వార్టర్లీ సెప్టెంబర్ 16 నుంచి 23 వరకు, మూడో యూనిట్ పరీక్షలు అక్టోబర్ 16 నుంచి 18 వరకు జరగనున్నాయి. దసరా సెలవులు అక్టోబర్ 19 నుంచి 25 వరకు ఇవ్వనున్నారు. నాలుగో యూనిట్ పరీక్షలు నవంబర్ 23 నుంచి 25 వరకు, హాఫ్ ఇయర్లీ పరీక్షలు డిసెంబర్ 18 నుంచి 23 వరకు ఉంటాయి. సంక్రాంతి సెలవులు 2024 జనవరి 11 నుంచి 17 వరకు ఇస్తారు. ప్రీ ఫైనల్ జనవరి 19 నుంచి 25 వరకు, వార్షిక పరీక్షలు మార్చి మొదటి వారంలో నిర్వహించేలా విద్యా క్యాలెండర్‌ను ప్రకటించారు.

అమ్మ ఒడితో ఉన్నత చదువులవైపు

ఇంటర్మీడియట్ విద్యార్థులకు సైతం అమ్మ ఒడి పథకం కింద అర్హులైన వారికి ఏడాదికి రూ.15 వేలు ప్రభుత్వం అందిస్తుండడంతో పేద విద్యార్థులు సైతం ఉన్నత చదువుల వైపు వస్తున్నారు. జిల్లాలో 2022 – 23 విద్యా సంవత్సరానికి 25,945 మంది విద్యార్థులకు అమ్మ ఒడి పథకం కింద రూ. 38.92 కోట్లు మంజూరయ్యాయి. ప్రభుత్వ జూనియర్ కాలేజీలను బలోపేతం చేసే క్రమంలో 'నాడు – నేడు' కింద మౌలిక వసతుల కల్పనకు నిధులు కేటాయించగా, వీటితో చేపట్టిన పనులు తుదిదశకు చేరుకున్నాయి. దీంతో విద్యార్థులకు అవసరమైన అన్ని సౌకర్యాలూ సమకూరనున్నాయి.

అడ్మిషన్ల పెంపుపై ప్రత్యేక దృష్టి



2023 – 24 విద్యా క్యాలెండర్ ప్రకారం గురువారం నుంచి జూనియర్ కాలేజీల్లో తరగతులు ప్రారంభమయ్యాయి. సప్లిమెంటరీ పరీక్షలు గురువారంతో ముగిశాయి. స్పాట్ వాల్యూవేషన్ కూడా పది రోజుల్లో పూర్తి చేసేలా శ్రద్ధ తీసుకుంటున్నాం. ఉన్నతాధికారుల ఆదేశాలకు అనుగుణంగా ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ల పెంపునకు కృషి చేస్తున్నాం.

– పి.ఉమారాణి, ఆర్ఐవో, ఉమ్మడి విశాఖ జిల్లా

అనకాపల్లిలో నేటి నుంచి నాటకోత్సవాలు



నాటిక పోటీల కరపత్రాలను ఆవిష్కరిస్తున్న క్లబ్ సభ్యులు

అనకాపల్లిటౌన్: నేటి యువత సెల్‌ఫోన్లు, కంప్యూటర్లపై దృష్టి ఎక్కువగా సారించడంతో నాటికలకు ప్రాధాన్యం లేకుండా పోయిందని, భావి తరాలకు సంస్కృతిని అందించడానికి నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్టు జార్జి క్లబ్ అధ్యక్షుడు బుద్ద కాశీ విశ్వేశ్వరరావు తెలిపారు. స్థానిక క్లబ్ ఆవరణలో శుక్రవారం నుంచి ఆదివారం వరకూ జరిగే నాటకోత్సవాల కరపత్రాలను గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ అనకాపల్లి, మునగపాక మండలాలు నాటికలకు పుట్టినిళ్లని, నేటి యువతకు నాటికలపై అవగాహన కల్పించాలని ఆయన కోరారు. క్లబ్ ఆవరణలో కొణతాల వెంకట నారాయణమ్మ కళా ప్రాంగణంలో ఉభయ తెలుగు రాష్ట్రాల ఆహ్వాన నాటకోత్సవాలు నిర్వహిస్తున్నట్టు తెలిపారు. పలు స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో నాటికలు ఉచిత ప్రదర్శనలు ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ నెల 2న సాయంత్రం 6.30 గంటలకు శ్రీకాకుళం జిల్లా బోరివంక శార్వాణి గిరిజన సాంస్కృతిక సేవా సమితి వారి 'నిర్జీవ నినాదం' నాటిక (రచన అడపా సూరిబాబు), రాత్రి 8 గంటలకు విశాఖపట్నం తెలుగు కళా సమితి వారితో 'నిశ్శబ్దమా నీ ఖరీదెంత' నాటిక (రచన పి.టి.మాధవ్), 3న సాయంత్రం 6.30 గంటలకు హైదరాబాద్ కళాంజలి వారి 'రైతే రాజు' నాటిక (రచన కంచర్ల సూర్యప్రకాశరావు), రాత్రి 8 గంటలకు గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి 'అతీతం' నాటిక (దర్శకత్వం ఎస్.రవీంద్రరెడ్డి), 4న సాయంత్రం 6.30 గంటలకు గుంటూరు అమృత లహరి థియేటర్ ఆర్ట్స్ వారి 'నాన్నా నేనొచ్చేస్తా' నాటిక (నాటకీకరణ తాళాబత్తుల వెంకటేశ్వరరావు), రాత్రి 8 గంటలకు చిలకలూరిపేట వారి 'అలితో సరదాగా' హాస్య నాటిక (రచన అద్దేపల్లి భరత్‌కుమార్) ప్రదర్శించనున్నట్టు తెలిపారు. నాటిక పోటీలను ఉచితంగా తిలకించవచ్చన్నారు. కార్యక్రమంలో క్లబ్ కార్యదర్శి మళ్ల చంద్రశేఖర్, కోశాధికారి ఆళ్ల వెంకట సూకేశ్వరరావు, ఉపాధ్యక్షుడు చవితిని నర్సింగరావు, నాటికల కన్వీనర్‌గా మాజీ కౌన్సిలర్ కె.ఎం.నాయుడు, క్లబ్ మేనేజర్ ఆర్.సీతారాం పాల్గొన్నారు.

బైక్ స్కిడ్ అయినట్టు నటించి...

- సినీ ఫక్కీలో మొబైల్ ఫోన్ చోరీ
- గన్నవరం గ్రామంలో ఘటన
- 100కి బాధితుడి ఫిర్యాదు

సాక్షి, అనకాపల్లి: మొబైల్ దొంగలు ఇప్పుడు కొత్త పంథాలో చోరీలకు పాల్పడుతున్నారు. నాతవరం మండలం గన్నవరం గ్రామంలో గురువారం ఉదయం 11 గంటల సమయంలో ఒక గుర్తు తెలియని వ్యక్తి బైక్ స్కిడ్ అయినట్టు నటించి.. సహాయం చేసిన వ్యక్తి జేబులో నుంచే మొబైల్ కొట్టేసిన ఘటన చోటుచేసుకుంది. బాధితుడు చెప్పిన వివరాల ప్రకారం.. నాతవరం పీఎస్ పరిధిలో గన్నవరం గ్రామానికి చెందిన పెట్ల సత్యనారాయణ అనే రైతు రోడ్డు మీద వెళుతున్నాడు. ఆయన చొక్కా జేబులో స్మార్ట్ ఫోన్‌ను చూసిన గుర్తుతెలియని వ్యక్తి అతని ముందుకు వచ్చి బైక్ స్కిడ్ అయినట్టు నటించాడు. ఒక వైపునకు వాలిన బైక్‌ను తేల్చలేనట్టుగా నటించాడు. ఇంతలో పక్కనే ఉన్న రైతు పెట్ల సత్యనారాయణ సహాయం చేశాడు. అక్కడే సమీపంలో మరో వ్యక్తి బైక్ ఆపి సహాయం చేసినట్టుగా వచ్చి..సత్యనారాయణ జేబులో స్మార్ ఫోన్ దొంగిలించాడు. ఇది గమనించని బాధితుడు వాళ్లు వెళ్లిపోయిన తర్వాత తన జేబులో చూసుకుంటే మొబైల్ లేదు. ఎక్కడైనా పడిపోయిందా.? అని సమీపంలో వెతకసాగాడు. అప్పటికే బైక్ మీద వచ్చిన దొంగలు పరారైపోయారు. కొద్ది నిమిషాల వరకూ వెతకడం ప్రారంభించిన బాధితుడు..వాళ్లకు సహాయం చేసినప్పుడే పోయిందని గ్రహించి చేసేదేమీ లేక స్నేహితుడి సహాయంతో 100కి ఫోన్ చేసి ఫిర్యాదు చేశాడు.

గుట్టుగా ఇసుక అక్రమ రవాణా

- జిల్లా సరిహద్దులో రాత్రి పూట తవ్వకాలు
- పట్టించుకోని అధికారులు



రాత్రి పూట ఇసుకతో నింపి తరలిస్తున్న ట్రాక్టర్లు

రోలుగుంట: పగలయితే అధికారులు దాడులుంటాయని.. రాత్రిపూట గుట్టుగా ఇసుక అక్రమ తవ్వకాలు సాగిస్తున్నారు. అల్లూరి సీతారామరాజు, అనకాపల్లి జిల్లాల సరిహద్దులో రోలుగుంట మండలం శివారు ఎం.కె.పట్నం పంచాయితీ శివారు పెదపేట రెవెన్యూలో ప్రభుత్వం చెడ్డవాగు పెదసాకిరేవు నుంచి రావణాపల్లి అవకు ప్రవహిస్తున్న గెడ్డ ఇసుక తవ్వకాలకు అడ్డాగా మారింది. ఒకప్పుడు ఒకే జిల్లాలో గల కొయ్యూరు, రోలుగుంట మండలాలు నేడు జిల్లాల విభజనలో అల్లూరి, అనకాపల్లి జిల్లాలుగా మారి ఇది సరిహద్దుగా ఉండడంతో ఇసుకాసురులకు ఇది వరంగా మారింది. చీకటి వ్యాపారం చేసుకుంటూ ట్రాక్టరు లోడు రూ.8వేలకు అమ్ముకుని సొమ్ము చేసుకుంటున్నారు. ఈ తవ్వకాలు ఇలానే కొనసాగితే గెడ్డలోతు పెరిగి వర్షాకాలంలో నీటి ప్రవాహానికి తమ భూములు కోతకు గురయ్యే ప్రమాదం ఉందని స్థానిక ఆదివాసీలు ఆందోళన చెందుతున్నారు. ఇక్కడ జరుగుతున్న ఇసుక అక్రమ రవాణాపై సంబంధిత అధికారులు దృష్టి సారించి అక్రమాలను అడ్డుకోవాలని వారు కోరుతున్నారు. రెండు జిల్లాల సరిహద్దు కావడంతో రెవెన్యూ అధికారులు తమ పరిధి కాదని తప్పించుకుంటున్నారని ఈ ప్రాంతవాసులు ఆరోపిస్తున్నారు. దీనిపై రోలుగుంట మండలం ఎం.కె.పట్నం రెవెన్యూ వీఆర్వో పి.రాజులమ్మ వివరణ కోరగా తాను ఈ ప్రాంతంలో రెండు దఫాలు తనిఖీ చేశానని, ఈ విషయం ఉన్నతాధికారులకు, మైనింగ్ అధికారులకు ఫిర్యాదు చేసి అవసరమైన చర్యలు తీసుకుంటామని అన్నారు.



గుట్టలుగా ఇసుక

గంజాయితో ముగ్గురు అరెస్టు

గొలుగొండ: కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా 8 కేజీల గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను కృష్ణదేవిపేట పోలీసులు పట్టుకున్నారు. ఎస్ఐ ఉపేంద్ర అందించిన వివరాలివి. చింతపల్లి ప్రాంతం నుంచి అబ్దుల్ బాషిత్, అబూకర్, సిహెచ్.నవీన్‌కుమార్ అనే ముగ్గురు వ్య క్తులు బ్యాగ్‌లో 8 కే జీల గంజాయి తరలిస్తున్న సమ యంలో కృష్ణదేవిపేట బస్‌స్టేషన్ వద్ద పో లీసులు పట్టు కున్నారు. వారి వద్ద నుంచి రెండు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నామని, ముగ్గురినీ అరెస్టు చేసి కోర్టుకు తరలించామని ఎస్ఐ తెలిపారు.

వ్యాన్ ఢీకొని బాలుడికి గాయాలు

మద్రిపాలెం: వ్యాన్ ఢీకొని బాలుడికి గాయాలైన ఘటన విశాఖ కంచరపాలెం పరిధిలో జరిగింది. ఈ మేరకు ఐదో పట్టణ పోలీసులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. యలమంచిలి ప్రాంతానికి చెందిన కశింకోట భవాని, తన కుమారుడు శశిభూషణ్(7)తో కలిసి గత నెల 31న(బుధవారం) కంచరపాలెం కప్పరాడ ప్రాంతానికి తన బంధువుల ఇంటికి వచ్చారు. వారు గురువారం ఉదయం కప్పరాడ జంక్షన్ ఆంజనేయస్వామి ఆలయం వద్ద రోడ్డు దాటుతుండగా ఊర్వశి జంక్షన్ నుంచి తాటిచెట్లపాలెం వైపు వెళ్తున్న ఏసర్ వాహనం ఢీకొంది. దీంతో శశిభూషణ్‌కు గాయాలయ్యాయి. తల్లి భవానీ ఫిర్యాదు చేయడంతో కంచరపాలెం సీఐ ఎస్.విజయ్‌కుమార్ నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ అబద్ధం కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

సూట్‌కేసుల్లో గంజాయి తరలింపునకు యత్నం

కూర్మన్నపాలెం(గాజువాక): రెండు సూట్‌కేసుల్లో పెట్టి అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఇద్దరిని దువ్వాడ పోలీసులు అరెస్ట్ చేశారు. వివరాలిలా ఉన్నాయి. పశ్చిమ బెంగాల్‌కు చెందిన ఇమ్రాన్ అలీ(27), ఉత్తరప్రదేశ్‌కు చెందిన అబ్దుల్ జబ్బీర్(33) గత నెల 20న గంజాయి కోసం విశాఖపట్నానికి వచ్చారు. నగరానికి చెందిన ఓ వ్యక్తి వద్ద నుంచి 15 కేజీల గంజాయి కొనుగోలు చేశారు. ఇందుకు రూ.30 వేలు చెల్లించారు. ఎవరికీ అనుమానం రాకుండా రెండు సూట్‌కేసుల్లో గంజాయి అమర్చి తరలించేందుకు ప్రయత్నించారు. పక్కా సమాచారం మేరకు దువ్వాడ పోలీసులు కూర్మన్నపాలెం వద్ద తనిఖీ నిర్వహించారు. కూర్మన్నపాలెం బస్ డిపో వద్ద నిందితులు అనుమానాస్పదంగా తిరుగుతూ దువ్వాడ రైల్వేస్టేషన్‌కు వెళ్లేందుకు ఆటోలను ఆపుతున్నారు. ఈ క్రమంలో పోలీసులను చూసి సూట్‌కేసులను అక్కడ వదిలి పారిపోయేందుకు ప్రయత్నించారు. దువ్వాడ పోలీసులు అప్రమత్తమై వెంబడించి మరీ నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి 15 కేజీల గంజాయి, రెండు సెల్‌ఫోన్‌లు, రూ.1200 నగదు స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి నిందితులను రిమాండ్‌కు తరలించారు.

13 మంది 'అప్పన్న' ఉద్యోగులకు స్థానచలనం

సింహాచలం: సింహాచలం దేవస్థానంలో 13 మంది ఉద్యోగులకు బదిలీ అయింది. దేవస్థానంలో ఏఈవోలుగా పనిచేస్తున్న ఎన్.ఆనంద్‌కుమార్, ఇజిరోతు శ్రీనివాసరావును అన్నవరం దేవస్థానానికి, అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్‌గా పనిచేస్తున్న సుంకర తాతాజీని విజయవాడ దేవస్థానానికి స్థానచలనం జరిగింది. అలాగే సూపరింటెండెంట్లు పద్మనాభరాజు, పిల్లా శ్రీనివాసరావు, అప్పలనాయుడు, రాజ్యలక్ష్మి, గోపీనాథ్‌కు అన్నవరం దేవస్థానానికి, సూపరింటెండెంట్ జి.వి.ఎస్.కె.ప్రసాద్‌కి కనకమహాలక్ష్మి దేవస్థానానికి బదిలీ అయింది. అలాగే ముగ్గురు సీనియర్ అసిస్టెంట్లు, జూనియర్ అసిస్టెంట్ బదిలీ అయ్యారు.

పాలిటెక్నిక్ సెంటర్ వద్ద వాగ్వాదం

- ప్రైవేట్ కళాశాలల ఏజెంట్ల హల్‌చల్
- ప్రభుత్వ కళాశాల సిబ్బందితో దురుసు ప్రవర్తన

నర్సీపట్నం: ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో జరుగుతున్న సర్టిఫికేట్ల వెరిఫికేషన్ వద్ద ప్రైవేట్ కళాశాలల ఏజెంట్లు తిష్టవేసి ఉండడంతో కళాశాల సిబ్బంది నిలదీశారు. దీంతో కౌన్సెలింగ్ సెంటర్ వద్ద వాగ్వాదం చోటు చేసుకుంది. వారి వారి కళాశాలలో అడ్మిషన్లు పెంచుకునేందుకు ప్రైవేట్ కళాశాలల ప్రతినిధులు నియమించుకున్న ఏజెంట్లు కళాశాల వద్ద తిష్ట వేసి విద్యార్థులను మోటివేషన్ చేస్తున్నారు. మూడు రోజుల నుంచి కౌన్సెలింగ్‌కు వచ్చిన విద్యార్థుల నుంచి ఫోన్ నెంబర్లు, జిరాక్స్ సర్టిఫికెట్లు సేకరిస్తున్నారు. దీనిని కళాశాల సిబ్బంది గమనించి బయట వ్యక్తులు కళాశాల ఆవరణ నుంచి వెళ్లిపోవాలని సూచించారు. అయితే తాము విలేకరులమని టీవీ 49 పేరుతో ఐడీ కార్డు చూపిస్తూ కళాశాల సిబ్బందితో దురుసుగా ప్రవర్తించారు. విద్యార్థుల గార్డియన్‌గా చెప్పుకుంటూ సర్టిఫికెట్ల వెరిఫికేషన్ వద్ద హల్‌చల్ చేశారు. దీంతో విలేకరుల ముసుగులో వచ్చిన ప్రైవేట్ కళాశాలల ఏజెంట్ల చేతుల్లో ఉన్న విద్యార్థుల వివరాలతో కూడిన డైరీలను కళాశాల సిబ్బంది స్వాధీనం చేసుకున్నారు. విద్యార్థుల వివరాలతో మీకేంటి పని? అంటూ గట్టిగా వారిని నిలదీశారు. దీంతో ఆ ఏజెంట్లు అక్కడ నుంచి జారుకున్నారు.

పురుగు మందు తాగి యువకుడి మృతి



వంశీకృష్ణ (ఫైల్)

రాంబిల్లి: గోవిందపాలేనికి చెందిన ధారబోయిన వంశీకృష్ణ(20) గురువారం పురుగు మందు సేవించి మృతి చెందినట్టు ఎస్ఐ దీనబంధు తెలిపారు. వంశీకృష్ణ పురుగు మందు సేవించి వుండగా గమనించిన కుటుంబసభ్యులు అనకాపల్లి ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించగా అక్కడ వైద్యులు పరీక్షించి మృతి చెందినట్టు నిర్ధారించారు. ఈ మేరకు వంశీకృష్ణ తండ్రి నర్సింహమూర్తి తమకు ఫిర్యాదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. గతంలో మైనర్ బాలికను వేధించిన కేసులో వంశీ రెండు నెలలు జైలు శిక్ష అనుభవించి, బెయిల్‌పై బయటకు వచ్చాడు. కేసు కోర్టులో ఉండడంతో తనకు శిక్ష పడుతుందని మళ్లీ జైలుకు వెళ్లాల్సి వస్తుందని భావించి మనస్తాపానికి గురై పురుగుమందు తాగాడని ఎస్ఐ తెలిపారు. కేసు దర్యాప్తు చేస్తున్నామన్నారు.

వర్షపు నీటిని ఒడిసి పడదాం



సదస్సులో మాట్లాడుతున్న మణికుమార్

అనకాపల్లిటౌన్: సాంకేతిక పరిజ్ఞానంతో వర్షపు నీటిని ఒడిసి పట్టి భూగర్భ జలాలు పెంచుకునే దిశగా చర్యలు చేపట్టాలని జిల్లా నీటి యాజమాన్య సంస్థ సహాయ పథక సంచాలకులు (ఏపీడీ) కె.మణికుమార్ అన్నారు. స్థానిక గౌరీ గ్రంథాలయంలో గురువారం సాయంత్రం గ్రంథాలయ అధ్యక్షుడు కాండ్రేగుల వెంకటరమణ అధ్యక్షతన కేంద్ర యువజన వ్యవహారాలు, క్రీడల మంత్రిత్వశాఖ నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో «వర్షపు నీటిని ఒడిసి పట్టండి» అనే అంశంపై జరిగిన మహిళా సదస్సుకు ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. భావితరాలకు నీటిని అందించే దిశగా స్వచ్ఛంద సంస్థలు కార్యక్రమాలు చేపట్టాలని సూచించారు. నీటి సంరక్షణ పనులు సాంకేతిక పరిజ్ఞానంతో నిర్వహించాలని, ఉపాధి హామీ నిధులను వినియోగించుకోవాలని సూచించారు. వర్షపు నీటిని ఒడిసి పట్టడానికి వీలు కల్పించే విధంగా భవన నిర్మాణ డిజైన్లు సిద్ధం చేసుకోవాలన్నారు. నెహ్రూ యువ కేంద్రం జిల్లా యువజన అధికారి జి.మహేశ్వరరావు మాట్లాడుతూ జలసంరక్షణ, వర్షం నీటి సంరక్షణ, శుద్ధి చేసిన వ్యర్థ జలాలను తిరిగి వినియోగించడం, వనరుల పునరుజ్జీవం, మొక్కలు నాటే కార్యక్రమాలు అమలు చేయాలన్నారు. గ్రంథాలయ మాజీ కార్యదర్శి మళ్ల బాపునాయుడు, సభ్యులు కర్రి హనుమంతరావు, బొడ్డేడ జగ్గ అప్పారావు, మహిళా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

రేపటి నుంచి ఏపీపీఎస్సీ పరీక్షలు



మాట్లాడుతున్న డీఆర్వో శ్రీనివాసమూర్తి

విశాఖ విద్య: జిల్లాలో ఈ నెల 3 నుంచి 10వ తేదీ వరకు జరగనున్న ఏపీపీఎస్సీ పరీక్షకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని జిల్లా రెవెన్యూ అధికారి ఎస్.శ్రీనివాసమూర్తి అధికారులను ఆదేశించారు. పరీక్షల నిర్వహణపై గురువారం కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో ఆయన సమీక్షించారు. ఏయూలో జరగనున్న ఈ పరీక్షలకు జిల్లాలో 1,283 మంది అభ్యర్థులు హాజరవుతారన్నారు. పరీక్ష సమయానికి 10 నిమిషాల ముందు మాత్రమే అభ్యర్థులను పరీక్షా కేంద్రంలోకి అనుమతించాలన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా ఏదో ఒక గుర్తింపు కార్డు తీసుకు రావాలన్నారు. మొబైల్ ఫోన్లు, స్మార్ట్ వాచీలు, డిజిటల్ పరికరాలు వంటివి అనుమతించరని తెలిపారు. పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు చేయడంతోపాటు తాగునీటి సదుపాయం, ఆరోగ్య సిబ్బందిని అందుబాటులో ఉంచాలన్నారు. విద్యుత్ అంతరాయం కలగకుండా చూడాలని ఈపీడీసీఎల్ అధికారులను ఆదేశించారు. సమావేశంలో ఎస్‌డిసి జె.వి.ఎస్.ఎస్.రామ్మోహన్‌రావు, ఎస్.వెంకటేశ్వర్లు, డీఎస్‌వో సూర్యప్రకాశరావు, ఏయూ కాలేజ్ ఆఫ్ ఆర్ట్స్ అండ్ కామర్స్ ప్రిన్సిపాల్ ఎ.నరసింహారావు, ఏపీపీఎస్సీ డిప్యూటీ సెక్రటరీ ప్రసూన, సెక్షన్ ఆఫీసర్లు, విద్యుత్, ఆర్టీసీ, జీవీఎంసీ, పోలీస్, రెవెన్యూ అధికారులు పాల్గొన్నారు.

ప్రసాద్ స్కీమ్ పనుల బుక్‌లెట్ రూపకల్పన

సింహాచలం : శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి దేవస్థానంలో కేంద్ర ప్రభుత్వం ప్రసాద్ స్కీమ్ ద్వారా చేసే అభివృద్ధి పనుల జాబితాని దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు బుక్‌లెట్ రూపంలో పొందుపరిచారు. ఆ బుక్‌లెట్‌ని విశాఖ శ్రీ శారదాపీఠంలో పీఠాధిపతి స్వరూపానందేంద్ర సరస్వతి గురువారం ఆవిష్కరించారు. రూ.54.04 కోట్లతో దేవస్థానంలో జరగనున్న పలు అభివృద్ధి పనులకు సంబంధించి గత నెల 26 నుంచి ఏపీ టూరిజం డెవలప్‌మెంట్ టెండర్ల ప్రక్రియకి శ్రీకారం చుట్టింది. ఆ పనులకి సంబంధించి పూర్తి అంశాలతో ట్రస్ట్ బోర్డు సభ్యులు బుక్‌లెట్‌ని తయారు చేశారు. దాన్ని స్వామీజీ ఆవిష్కరించారు. దేవస్థానం ట్రస్ట్ బోర్డు సభ్యులు గంట్ల శ్రీనుబాబు, దొడ్డి రమణ, వారణాసి దినేష్‌రాజ్, సువ్వాడ శ్రీదేవి, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు పాల్గొన్నారు.

చందనోత్సవ నిర్వహణ వైఫల్యాలపై విచారణ



కప్ప స్తంభానికి మొక్కుకుంటున్న ఏడీసీ చంద్రకుమార్

సింహాచలం: వరాహ లక్ష్మీ నృసింహ స్వామి చందనోత్సవం నిర్వహణలో చోటు చేసుకున్న వైఫల్యాలపై రాష్ట్ర దేవదాయ శాఖ అడిషనల్ కమిషనర్ చంద్రకుమార్ గురువారం విచారణ చేపట్టారు. ఏప్రిల్ 23న జరిగిన చందనోత్సవంలో రాజగోపురం ఎదురుగా గంటల తరబడి వీఐపీలు నిలబడటం, వారంతా తమకు దర్శనం కాలేదని నిరసన వ్యక్తం చేయడం, శారదాపీఠాధిపతి చందనోత్సవం నిర్వహణపై బహిరంగంగా విమర్శించడం, తర్వాత ఈ ఘటనపై కలెక్టర్ విచారణకు ఆదేశించడం, దేవస్థానం ఉద్యోగులను జేసీ తన కార్యాలయంలో విచారించడం తెలిసిందే. అలాగే దేవదాయశాఖ కూడా విచారణకు ఆదేశించి చంద్రకుమార్‌ను నెల రోజుల కిందటే నియమించింది. ఈ నేపథ్యంలో గురువారం ఆయన దేవస్థానానికి వచ్చి విచారణ చేపట్టారు. ఏయే ప్రాంతాల్లో లోటుపాట్లు జరిగాయో స్వయంగా పరిశీలించారు. కొన్ని రికార్డులను తనిఖీ చేశారు. దేవస్థానం ఈవోతో మాట్లాడారు. క్యూలు ఏ విధంగా ఏర్పాటు చేశారని ఇంజినీరింగ్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఆ రోజు ఆయా ప్రాంతాల్లో విధులు నిర్వర్తించిన దేవస్థానం ఉద్యోగులతో మాట్లాడారు. జిల్లా కలెక్టర్ మినిట్స్‌ను పరిశీలించారు. టికెట్లు ఎన్ని ముద్రించారు.? ఎన్ని విక్రయించారు? తదితర వివరాలు సేకరించారు. శుక్రవారం కూడా విచారణ కొనసాగనుంది. విచారణలో దేవదాయశాఖ డీసీ విజయ్‌రాజ్ చంద్రకుమార్ ఉన్నారు. ఈ సందర్భంగా చంద్రకుమార్ స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు.

పిస్టల్ తరలిస్తున్న వ్యక్తి అరెస్ట్

మరో ఐదుగురిని విచారిస్తున్న పోలీసులు

సీతమ్మధార: మహారాష్ట్ర నుంచి ఒడిశాకు తుపాకీని తీసుకెళ్తున్న శ్రీధర్ హరికిషన్ పతాంగిని ఫోర్త్‌టౌన్ పోలీసులు అరెస్ట్ చేశారు. స్టేషన్‌లో గురువారం విలేకరుల సమావేశంలో క్రైం డీసీపీ నాగన్న వివరాలు వెల్లడించారు. మహారాష్ట్రకు చెందిన శ్రీధర్ హరికిషన్‌కు జిల్నా జిల్లాకు చెందిన దత్త పవర్ పిస్టల్ ఇచ్చి దానిని పూరిలోని ఓ వ్యక్తికి ఇస్తే రూ.30 వేలు ఇస్తామని బేరం కుదుర్చుకున్నాడు. అడ్వాన్స్‌గా రూ.10 వేలు శ్రీధర్‌కు ఇచ్చాడు. దీంతో శ్రీధర్ పూరి వెళ్దామని ఐదుగురు స్నేహితులను బయలుదేరించాడు. సోమవారం ఉదయం జల్నా నుంచి రైల్లో బయలుదేరి నాందేడ్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి నాగావళి ఎక్స్‌ప్రెస్‌లో మంగళవారం ఉదయం విశాఖకు వచ్చారు. విశాఖలో విశ్రాంతి తీసుకుని బుధవారం పూరి వెళ్లేందుకు ప్లాన్ చేసుకున్నారు. రైల్వే న్యూ కాలనీలోని ఓ లాడ్జిలో 101, 105 నంబర్లు ఉన్న గదులను బుక్ చేసుకున్నారు. కాగా రోజు వారి విధుల్లో భాగంగా ఎస్ఐలు ఖగేశ్వరరావు, వెంకటరావు మంగళవారం ఈ లాడ్జిని తనిఖీ చేసినప్పుడు వారు అనుమానాస్పదంగా కనిపించారు. వారి బ్యాగులు తనిఖీ చేయగా తుపాకీ బయటపడింది. దీంతో ఆరుగురిని ఫోర్త్‌టౌన్ స్టేషన్‌కు తరలించి విచారించడంతో అసలు విషయం బయటపడింది. మహారాష్ట్రలో శ్రీధర్‌కు తుపాకీ ఇచ్చిన దత్తపవర్ చిరునామా కనుగొన్న ఎస్ఐ వెంకటరావు బృందం..అక్కడకు వెళ్లి తుపాకీ అమ్మిన వ్యక్తిని అదుపులోకి తీసుకుని నగరానికి తీసుకొస్తున్నారు. శ్రీధర్‌పై కేసు నమోదు చేసి గురువారం రిమాండ్‌కు తరలించారు.



క్లుప్తంగా

5వ విడత రైతు భరోసా మంజూరు

కశింకోట: మండలంలోని 9635 మంది రైతులకు 5వ విడత రైతు భరోసా వచ్చినట్లు మండల వ్యవసాయ అధికారి స్వప్న తెలిపారు. ఒక్కొక్కరికి రాష్ట్ర ప్రభుత్వం రూ.5500 వంతున సుమారు రూ. 5.29 కోట్లు మంజూరైందన్నారు. దీన్ని ఆన్‌లైన్ ద్వారా రైతుల వ్యక్తిగత బ్యాంకు ఖాతాల్లో నేరుగా రానుందని తెలిపారు. ఇప్పటికే నాలుగు విడతలు రైతు భరోసా అందించారని, వరుసగా ఇది ఐదో విడత అన్నారు.

చెట్టు మీద నుంచి పడి గీత కార్మికుడి మృతి


మృతి చెందిన గీత కార్మికుడు తాతారావు

కశింకోట: మండలంలోని సోమవరం గ్రామంలో కల్లు గీత కార్మికుడు దుంగా తాతారావు (64) కల్లు గీస్తూ కుటుంబ జీవనం సాగిస్తున్నాడు. దీనిలో భాగంగా సమీపంలోని శారదానది గట్టు వద్ద ఉన్న తాటి చెట్టు ఎక్కి కల్లు గీయాలనుకున్నాడు. ఈ నేపథ్యంలో నడుముకు కట్టుకున్న మోకుతాడు ముడి ఊడిపోవడంతో కింద పడి అక్కడికక్కడే మృతి చెందాడు. భార్య నూకరత్నం ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. మృతునికి భార్య, పెళ్లైన కుమారుడు, ఇద్దరు కుమార్తెలున్నారు.

రాజుపాలేనికి ఆధ్యాత్మిక శోభ


ఉత్సవ విగ్రహాలను ఊరేగిస్తున్న కమిటీ సభ్యులు

అనకాపల్లిటౌన్: గ్రేటర్ విశాఖ విలీన గ్రామమైన రాజుపాలెం సూర్యనారాయణ స్వామి ఆలయం గురువారం ఆధ్యాత్మిక శోభ సంతరించుకుంది. అర్చకులు డి.కల్యాణ్‌కుమార్ ఆచారి ఆధ్వర్యంలో పలు పూజలతో పాటు మహాలక్ష్మి సమేత వైకుంఠ నారాయణ ఉత్సవ విగ్రహాల ఊరేగింపు జరిగింది. అంతకు ముందు విగ్రహాలకు జలాభిషేకం, క్షీరాభిషేకాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కొణతాల బాబూరావు, కమిటీ సభ్యులు జి.రామకోటేశ్వరరావు, కోశాధికారి జి. రామకృష్ణ, సభ్యులు నర్సింగరావు, బండారు వెంకటేశ్వరరావు, చిరంజీవి, భక్తులు పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి బెల్లం మార్కెట్‌కు గురువారం 90 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
మొదటి రకం	---	---
రెండో రకం	3,860	4,500
మూడోరకం	3,700	3,700

అనకాపల్లి సినిమాలు

కస్టడీ	- రాజా
అహింస	- సత్యనారాయణస్క్రీన్-1
పరేషాన్	- సత్యనారాయణస్క్రీన్-2
ది కేరళ స్టోరీ	- షిర్డిసాయి
విరుపాక్ష	- పర్తిసాయి
చక్రవ్యూహమ్	- వెంకటేశ్వర
నేను స్టూడెంట్ సర్	- శ్రీసత్య
బిచ్చగాడు-2	- రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్: జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-3 యూనిట్లు, బీ పాజిటివ్-2 యూనిట్లు, ఓ పాజిటివ్-23 యూనిట్లు శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్: ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా గురువారం 397 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 231 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

అమ్మో కొప్పాక బ్రిడ్జి..

పట్టణం నుంచి పలు ప్రాంతాలకు చేరుకోవడానికి ప్రజలు ఎక్కువగా ఉపయోగించే కొప్పాక బ్రిడ్జి శిథిల రోడ్లు, వెలగని విద్యుద్దీపాలతో ప్రమాదకరంగా మారింది. గ్రామీణ ప్రాంతాల నుంచి రాత్రిళ్లు.. తెల్లవారు జామున ప్రయాణించే రైతులతో పాటు పలువురు ఈ బ్రిడ్జిపై ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రమాదాల నివారణకు శిథిల రహదారిని బాగు చేయించి లైట్లు వెలిగించాలని స్థానికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

- రోడ్డు ప్రమాదాలకు నిలయం
- భయపెడుతున్న శిథిల సేఫ్టీగార్డులు
- వణికిస్తున్న గోతుల రహదారి.. వెలగని విద్యుద్దీపాలు


సేఫ్టీగార్డు లేని కొప్పాకబ్రిడ్జి


కొప్పాక బ్రిడ్జిపై జరిగిన ప్రమాదంలో దెబ్బ తిన్న లారీని పొక్లెయిన్ సాయంతో తొలగిస్తున్న దృశ్యం (ఫైల్)

అనకాపల్లిటౌన్: అనకాపల్లి–విశాఖ జాతీయ రహదారిలో రోడ్డు ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు తీసుకుని ప్రజల ప్రాణాలు కాపాడాలని ఆయా ప్రాంతాల వారు కోరుతున్నారు. నెలలో ఈ రహదారిలో సుమారు 10 రోడ్డు ప్రమాదాలు జరగడంతో పాటు కొందరు వాహన చోదకులు క్షతగాత్రులు కాగా, కొందరు మృత్యువాత పడుతున్నారు. ఆయా గ్రామాల ప్రజలు వివిధ పనులపై అనకాపల్లికి రాత్రీపగలు రాకపోకలు సాగిస్తున్నారు. మండలంలో కొప్పాక బ్రిడ్జి రోడ్డు ప్రమాదాలకు నిలయంగా మారింది. పట్టణంలో సుంకరమెట్ట జంక్షన్ నుంచి జలగల మదుం, కొప్పాక రైల్వే బ్రిడ్జి మీదుగా జీవీఎంసీ విలీన గ్రామాలను కలుపుతూ వాహన చోదకులు రాకపోకలు సాగిస్తున్నారు.

కొప్పాక బ్రిడ్జి వద్ద సమస్య..

కొప్పాక బ్రిడ్జికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. దీనికి ఆనుకుని సుమారు 1000 ఎకరాల భూమిలో రైతులు వరితో పాటు, కాయగూరలు పండిస్తారు. బ్రిడ్జికి ఇరువైపుల ఏర్పాటు చేసిన సెఫ్టీగార్డులను వాహనాలు ఢీకొనడంతో శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో బ్రిడ్జి మీద నుంచి వెళ్లే వాహనాలు అదుపు తప్పితే నేరుగా రైల్వే ట్రాక్‌పైకి దూసుకుపోతుంటాయి. అటువంటి సమయాల్లో రైళ్లు వచ్చినట్లయితే పెద్ద ప్రమాదాలు జరుగుతాయి. సుమారు ఏడాదిన్నర క్రితం తెల్లవారు జామున కాకినాడకు చెందిన కారు బ్రిడ్జిని ఢీకొని రైల్వే ట్రాక్ పక్కన పడిపోయింది. కారులో ప్రయాణిస్తున్న నలుగురు ప్రయాణికులు చిన్నచిన్న గాయాలతో బయటపడ్డారు. శ్రీకాకుళం జిల్లా నరసన్నపేటకు చెందిన ప్రైవేట్ ఉద్యోగి అచ్యుతాపురంలో విధులు నిర్వహించేందుకు కారులో వస్తుండగా ముందు వెళ్తున్న లారీని తప్పించబోయి బ్రిడ్జికి ఆనుకుని ఉన్న కాలువ గట్టును ఢీకొని అక్కడికక్కడే మృతి చెందాడు.

ఏలేరు కాలువ సమస్య..

అనకాపల్లి నుంచి విశాఖ వెళ్లే తరుణంలో పలువురు ఏలేరు కాలువ బ్రిడ్జిపై నుంచి రాకపోకాలు సాగిస్తారు. నిత్యం ఆ బ్రిడ్జికి ఆనుకుని కాలువలో నీరు ప్రవహిస్తుంటుంది. వర్షాకాలంలో రహదారి పైకి నీరు పారి వాహన చోదకులు గంటల కొద్దీ నిరీక్షించాల్సి వస్తుంది. కాలువ దాటిన వెంటనే కొప్పాక గ్రామానికి వెళ్లే మార్గం ఉంది. ఈ మార్గం నుంచి జాతీయ రహదారి పైకి వచ్చే ప్రజలు, వాహన చోదకులు రోడ్డు ప్రమాదాల్లో ఎక్కువగా మృత్యువాత పడుతున్నారు. మండలంలో అక్కిరెడ్డిపాలెం, కొత్తతలారివానిపాలెం, గోపాలపురం, ఎన్టీఆర్‌కాలనీ, గొలగాం, గణేష్‌నగర్ ప్రజలు అనకాపల్లి పట్టణానికి ఈ మార్గం ద్వారానే రాకపోకలు సాగిస్తున్నారు. అనకాపల్లి జిల్లా ఏర్పడిన తర్వాత విశాఖ నుంచి కలెక్టర్ కార్యాలయానికి వెళ్లే ప్రభుత్వ ఉద్యోగులు కొప్పాక మీదుగా కలెక్టర్, ఎస్పీ కార్యాలయానికి సులువుగా వెళ్లొచ్చు. ఇంత ప్రాముఖ్యత కలిగిన రహదారిలో రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు అధికారులు చర్యలు తీసుకోవాలని ఆయా ప్రాంతాల ప్రజలు, వాహనచోదకులు కోరుతున్నారు.


జాతీయ రహదారిలో వెలగని విద్యుత్ లైట్లు

విద్యుత్ లైట్లు లేక ఇక్కట్లు..

రహదారి గోతులమయంగా మారడంతో ఈ దారిలో తిరిగే వాహనాలు పాడైపోతున్నాయి. జాతీయ రహదారి జలగలకూడలి నుంచి సాలాపువానిపాలెం జాతీయ రహదారి వరకూ రహదారి మధ్యలో ఏర్పాటు చేసిన విద్యుత్ లైట్లు వెలగకపోవడంతో వాహన చోదకులకు ఇబ్బందులు తప్పడం లేదు.

చర్యలు తీసుకుంటాం



అన్ని శాఖల అధికారుల సమన్వయంతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటాం. మూడు రోజుల్లో లైట్లు మరమ్మతు పూర్తి చేస్తాం. దశల వారీగా రహదారి గోతుల మరమ్మతు పనులు చేపడతాం. రాత్రి వేళల్లో గ్రామీణ ప్రాంతాల నుంచి పట్టణానికి కూరగాయలు తీసుకు వచ్చే రైతులు మరింత జాగ్రత్త వహించాలి.

–పి.వెంకటరమణ, జెడ్సీ, అనకాపల్లి.

బీజేపీ ఎంపీని అరెస్టు చేయాలని ఆందోళన


నాలుగు రోడ్ల కూడలిలో ఆందోళన చేస్తున్న ప్రజా సంఘాల నేతలు


అనకాపల్లి రూరల్: భారత మహిళా రెజ్లర్లపై లైంగిక వేధింపులకు పాల్పడిన బీజేపీ ఎంపీ బ్రిజ్‌భూషణ్ సింగ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని వివిధ ప్రజా సంఘాల నేతలు డిమాండ్ చేశారు. గురువారం పట్టణంలోని నాలుగు రోడ్ల కూడలి వద్ద కేంద్ర ప్రభుత్వం అవలంబిస్తున్న తీరుకు నిరసనగా ఆందోళన చేపట్టారు. న్యాయం కోసం ఆందోళన చేస్తున్న భారత మహిళా రెజ్లర్లపై ఢిల్లీ పోలీసులు నమోదు చేసిన ఎఫ్ఐఆర్ రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా కౌలు రైతు సంఘం జిల్లా కార్యదర్శి మాట్లాడుతూ అంతర్జాతీయ స్థాయిలో పేరు తెచ్చిన మహిళా రెజ్లర్లపై బీజేపీ వ్యవహరిస్తున్న తీరు దారుణమన్నారు. పలువురు నేతలు కేంద్రం తీరును ఎండగడుతూ ప్రసంగించారు. కార్యక్రమంలో న్యాయవాది ఐఆర్ గంగాధర్, అనకాపల్లి బార్ అసోసియేషన్ అధ్యక్షుడు శేఖరమంత్రి సాయి లక్ష్మణరావు, ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు ఆర్. దొరబాబు, సీఐటీయూ నాయకుడు వీవీ శ్రీనివాసరావు, జన విజ్ఞాన వేదిక జిల్లా నేత బి. ఉమామహేశ్వరరావు, రైతు సంఘం జిల్లా నాయకుడు ఆళ్ల మహేశ్వరరావు, ఎస్. గణేష్, దాసరి సంతోష్ ,బుద్ధ కిషోర్, ఎ. దేవుడమ్మ, పిల్లి త్రినాథ్, వి. రాంప్రసాద్, వియ్యపు రాజు, రెడ్డిపల్లి అప్పలరాజు, పలు ప్రజా సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

వేసవి శిబిరాలతో చక్కటి విజ్ఞానం


గెలుపొందిన విద్యార్థులకు పుస్తకాలు అందిస్తున్న నాగభూషణం

తుమ్మపాల: వేసవి విజ్ఞాన శిబిరాల ద్వారా విద్యార్థులు విజ్ఞానాన్ని, ప్రతిభను పెంపొందించుకున్నారని సిద్ధార్థ సోషల్ సర్వీస్ అండ్ కల్చరల్ అసోసియేషన్ వ్యవస్థాపకుడు బల్లా నాగభూషణం అన్నారు. స్థానిక శాఖ వీధి ప్రభుత్వ గ్రంథాలయంలో గురువారం అంతర్జాతీయ బాలల దినోత్సవం ఘనంగా జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడ విజ్ఞానాన్ని ప్రసాదించే పుస్తకాలు అందుబాటులో ఉన్నాయన్నారు. అంతకు ముందు విద్యార్థులకు ×నేటి బాలలే.. రేపటి పౌరులు₹అనే అంశంపై వ్యాస రచన పోటీ నిర్వహించారు. ఈ పోటీల్లో 20 మంది విద్యార్థులు పాల్గొనగా ముగ్గురు విజేతలుగా నిలిచారు. వారికి కెరీర్ గైడ్లు, విజ్ఞాన వీచిక పుస్తకాలు, మిఠాయిలు, బిస్కెట్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో అసోసియేషన్‌ఉపాధ్యక్షుడు వినకోట నీలేష్‌గుప్త, సహాయ కార్యదర్శి అల్లాడ శ్రీనివాసరావు, సభ్యులు రొబ్బి మల్లేశ్వరరావు, గ్రంథాలయ అధ్యక్షుడు ఎస్.శ్రీనివాసరావు, విద్యార్థులు పాల్గొన్నారు.

వైభవంగా గరుడోత్సవం


ధ్యాన వేంకటేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాల ఊరేగింపు


మహిళల కోలాటం

కశింకోట: కశింకోట శివాలయం వద్ద వెలసిన ధ్యాన వెంకటేశ్వరస్వామి కల్యాణోత్సవంలో భాగంగా గరుడోత్సవం గురువారం రాత్రి ఘనంగా నిర్వహించారు. స్వామి కల్యాణోత్సవాన్ని బుధవారం రాత్రి వైభవంగా నిర్వహించారు. దీనిలో భాగంగా రెండో రోజు ఉత్సవాల ముగింపుగా వేంకటేశ్వరస్వామి, శ్రీదేవి, భూదేవిల ఉత్సవ విగ్రహాలను రథంపై నిలిపి గ్రామ ప్రధాన వీధుల్లో ఊరేగించారు. ఈ సందర్భంగా భక్తులు స్వామిని దర్శించుకుని పూజలు చేశారు. ఏపీ అర్చక ఎగ్జామినర్ రేజేటి శ్రీరామాచార్యులు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో అర్చకులు రేజేటి రామచరణాచార్యులు, మారుతి, సీతారామాచార్యులు తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

చురుగ్గా బీఎన్ రోడ్డు పునరుద్ధరణ పనులు

బుచ్చెయ్యపేట : మండలంలోని భీమునిపట్నం, నర్సీపట్నం (బీఎన్) రోడ్డులో గోతుల పూడ్చివేత పనులు జోరుగా సాగుతున్నాయి. కొమళ్లపూడి, బుదిరెడ్లపాలెం, విజయరామరాజుపేట, పీడీ పాలెం, శింగవరం, లోపూడి తదితర గ్రామాల వద్ద భారీ గోతులుపడి ప్రజలు రాకపోకలకు, రవాణాకు తీవ్ర ఇబ్బందులు పడేవారు. రోడ్డు సమస్యపై పలువురు నాయకులు ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ దృష్టికి తీసికెళ్లారు. వెంటనే గోతులను పూడ్చి తారు రోడ్డు నిర్మాణ పనులు వేగవంతం చేయాలని ఆర్అండ్‌బీ అధికార్లకు విప్ ధర్మశ్రీ సూచించారు. దీంతో గ్రామాల వద్ద గోతుల్లో పిక్క, రాయిబుగ్గితో లెవిలింగ్ పనులు చేపట్టారు. లెవిలింగ్ పూర్తయిన ప్రదేశాల్లో తారు రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు.

కొనసాగుతున్న పాలిసెట్ కౌన్సెలింగ్

తుమ్మపాల: మండలంలో రేబాక ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో నాల్గవ రోజైన గురువారం పాలిసెట్-2023 కౌన్సెలింగ్ కొనసాగింది. 43000 నుంచి 59000 వేల ర్యాంకు వరకు కౌన్సెలింగ్ జరిగిందని, 81 మంది బాలురు, 36 మంది బాలికలు హాజరైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ ఐవీఎస్ఎస్ శ్రీనివాసరావు తెలిపారు. 117 మంది విద్యార్థుల ధ్రువీకరణ పత్రాలు పరిశీలించి ఐసీఆర్ పత్రాలు అందించామన్నారు. శుక్రవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 5 గంటల వరకు 59001 నుంచి 75000 ర్యాంకు వరకు కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్లు ఆయన తెలిపారు.

సీనియర్ వైద్యుడు తుమ్మపాల మృతి


రంగారావు (ఫైల్)

అనకాపల్లిటౌన్: నాయుళ్ల వీధికి చెందిన సీనియర్ ఆర్ఎంపీ వైద్యుడు తుమ్మపాల రంగారావు (84) అనారోగ్యంతో మండలంలోని దర్జీనగర్‌లో గురువారం మృతి చెందారు. సేవాభావంతో పట్టణం, మండలంలో రోగులకు ఆయన ఉచితంగా వైద్య సేవలు అందించేవారు. శుక్రవారం ఉదయం దర్జీనగర్‌లో రంగారావు అంత్యక్రియలు నిర్వహిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

వారపు సంత తరలింపు

కశింకోట: కశింకోటలోని వారపు సంతను గురువారం పంచాయతీ ప్రధాన రహదారి మీదకు తరలించారు.సంత నిర్వహించే స్థలంలో కొత్తగా అరబిందో ఫార్మా పరిశ్రమ సహకారంతో సామాజిక భవనం (కల్యాణ మండపం) నిర్మాణం పనులు చేపట్టారు. దీంతో తాత్కాలికంగా సంతను పంచాయతీ ప్రధాన రహదారికి మార్పు చేశారు.

కుళాయి నీటిపై పుకార్లు షికారు

కశింకోట: కశింకోటలో కుళాయిల ద్వారా మంచినీటి సరఫరాపై గురువారం సాయంత్రం పుకార్లు షికారు చేశాయి. మంచినీటి ట్యాంకులో కోతి పడి మృతి చెందిందని, నీరు వాసన వస్తుందని పుకార్లు రావడంతో స్థానికులు ఒకింత ఆందోళన చెందారు. దీంతో పలువురు కుళాయి నీరు పట్టడానికి ముందుకు రాలేదు. ఈ నేపథ్యంలో కోతి మృతి చెందలేదని, అవన్నీ వట్టి పుకార్లు మాత్రమేనని పంచాయతీ కార్యదర్శి ఎస్. రమేష్ స్పష్టం చేశారు. ట్యాంకును శుభ్రపరిచి, నీటిని సరఫరా చేయడానికి చర్యలు తీసుకున్నామన్నారు.

'గ్రంథాలయాలను అలవాటు చేసుకోండి'


గ్రంథాలయంలో సభ్యులుగా చేరిన విద్యార్థులతో గ్రంథాలయాధికారి దమయంతి

నర్సీపట్నం: విద్యార్థులు రోజూ గ్రంథాలయాలకు రావటం అలవాటు చేసుకోవాలని స్థానిక గ్రంథాలయ అధికారి పి.దమయంతి సూచించారు. వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా గురువారం చిన్నారులకు పలు అంశాలను బోధించారు. పాఠశాల విద్యతో పాటు గ్రంథాలయాలకు వచ్చి పుస్తకాలు చదవటం అలవాటు చేసుకోవాలన్నారు. అనంతరం విశ్రాంత వ్యాయామ ఉపాధ్యాయులు ప్రభాకర్ అంతర్జాతీయ తల్లిదండ్రుల దినోత్సవం ఆవశ్యకతను చిన్నారులకు వివరించారు. ఇంగ్లిష్ టీచర్ స్పోకెన్ ఇంగ్లిష్‌పై విద్యార్థులకు తర్ఫీదునిచ్చారు. ఉపాధ్యాయులు పి.నూకరాజు విద్యార్థులకు తెలుగు పద్యాలపై పోటీలు నిర్వహించారు. క్రాఫ్ట్ టీచర్ లక్ష్మీరాజేశ్వరి కాగితాలతో పూలసజ్జను తయారు చేయటంపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. 55 మంది పిల్లలు, పెద్దలను గ్రంథాలయంలో సభ్యులుగా చేర్చుకున్నారు.

సీఎం జగన్ పాలనలో సుభిక్షంగా రాష్ట్రం


కల్వర్టు నిర్మాణ శిలా ఫలకం ఆవిష్కరిస్తున్న మంత్రి అమర్‌నాథ్

- మంత్రి గుడివాడ అమర్‌నాథ్


మహిళకు సంక్షేమ పథకాల పుస్తకాన్ని అందిస్తున్న మంత్రి అమర్‌నాథ్

అనకాపల్లిటౌన్: సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వంలోనే రాష్ట్ర ప్రజలు సుభిక్షంగా ఉన్నారని రాష్ట్ర వాణిజ్య, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్ అన్నారు. పట్టణంలో 83వ వార్డు పరిధి లక్ష్మీదేవిపేట, అన్నపూర్ణా బ్యాంకు, మిరియాలకాలనీ మూడో వీధుల్లో కార్పొరేటర్ జాజుల ప్రసన్నలక్ష్మి అధ్యక్షతన గురువారం రాత్రి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్ని ఆటుపోట్లు ఎదురైనా మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలకు కట్టుబడి నేరవేర్చుతున్న ఘనత ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. నియోజకవర్గంలో అభివృద్ధి దూసుకుపోవడానికి కారణం వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చిత్తశుద్ధే అన్నారు. దేశంలో పలు రాష్ట్రాలు మన రాష్ట్రం వైపు చూస్తున్నాయని చెప్పారు. ప్రజా సమస్యలను ఎప్పటికప్పుడు తెలుసుకుని వాటి పరిష్కారానికి తాను ఎల్లప్పుడూ సిద్ధంగా ఉంటానని హామీ ఇచ్చారు. ప్రతిపక్షాలు ఎన్ని కుట్రలు పన్నినా, సంక్షేమ పథకాలను నిరాటంకంగా అమలు చేస్తున్న జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వాన్ని తిరిగి అధికారంలోకి తీసుకు రావడానికి ఇప్పటికే ప్రజలు సిద్ధంగా ఉన్నారని దీమా వ్యక్తం చేశారు. వ్యవసాయం దండగ అన్న టీడీపీ ప్రభుత్వానికి కళ్లు తెరిపించి ఖరీఫ్‌కు ముందే పెట్టుబడి సాయం అందజేస్తున్న నాయకుడు సీఎం జగన్ అన్నారు. అంతకు ముందు ఇంటింటికీ వెళ్లి ప్రభుత్వ సంక్షేమ పథకాలపై ఆరా తీశారు. ప్రజల బాగోగులు తెలుసుకున్నారు. రూ.76 లక్షలతో నిర్మించనున్న కల్వర్టు నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ కార్యక్రమంలో ఎన్టీఆర్ వైద్యాలయ అభివృద్ధి కమిటీ డైరెక్టర్ జి.రామ్మూర్తి, వైఎస్సార్‌సీపీ పట్టణ అధ్యక్షుడు మందపాటి జానకీరామరాజు, మాజీ కౌన్సిలర్ కొణతాల మురళీకృష్ణ, పట్టణ యువజన విభాగం అధ్యక్షుడు జాజుల రమేష్, పార్టీ నాయకులు ఏవీ రత్నకుమారి, గైపూరి రాజు, జెడ్సీ పి.వెంకటరమణ, పార్టీ శ్రేణులు పాల్గొన్నారు.

ఘనంగా సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట


స్వామివారిని దర్శించుకుంటున్న ఎంపీ సత్యవతి, విష్ణుమూర్తి దంపతులు


స్వామి వారి సన్నిధిలో వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు


పూజలు చేస్తున్న విగ్రహ దాతలు, ప్రతిష్టాపకులు

అనకాపల్లిటౌన్: గవరపాలెం కామాక్షీ అమ్మవారి దేవాలయలో గురువారం విగ్రహ దాతలు పొన్నాడ సుందరయ్య, మల్లేశ్వరి, వెంకటసత్య, నరసింహాచారి, వెంకటరత్నం, వేణు, బ్రహ్మాజీ, సునీత దంపతుల ఆధ్వర్యంలో సుబ్రహ్మణ్యేశ్వర స్వామి విగ్రహ ప్రతిష్ట జరిగింది. ఆలయ అర్చకులు బొల్లాప్రగడ గణపతిశర్మ ఆధ్వర్యంలో తెల్లవారు జాము 5 గంటల నుంచి ప్రత్యేక పూజలు చేసి ఉదయం 8.08 నిమిషాలకు స్వామివారి విగ్రహ ప్రతిష్ట చేశారు. స్వామిని ఎంపీ భీశెట్టి వెంకట సత్యవతి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు, పార్టీ పార్లమెంట్ పరిశీలకుడు దాడి రత్నాకర్ దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. మధ్యాహ్నం అన్నసమారాధనను రత్నాకర్ ప్రారంభించారు. కార్పొరేటర్లు కొణతాల నీలిమ, పీలా లక్ష్మీసౌజన్య, పట్టణ విశ్వబ్రాహ్మణ సంఘం అధ్యక్షుడు కోటిపల్లి జేజిబాబు, ప్రధాన కార్యదర్శి కొమ్మోజు గోవిందరాజు, కోశాధికారి పొన్నాడ పెదబాబు, వైఎస్సార్‌సీపీ జిల్లా గ్రీవెన్స్ సెల్ అధ్యక్షుడు కాండ్రేగుల విష్ణుమూర్తి, కొణతాల భాస్కర్, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ, మాజీ ఎమ్మెల్సీ బుద్ద నాగజగదీష్, భక్తులు పాల్గొన్నారు.

భవన నిర్మాణ కార్మికులను ఆదుకోవాలి


అధికారులకు వినతి పత్రం అందిస్తున్న ఏఐటీయూసీ నేతలు

అనకాపల్లి రూరల్: తీవ్ర ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న తమను ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతూ గురువారం ఏఐటీయూసీ ఆధ్వర్యంలో భవన నిర్మాణ కార్మికులు ర్యాలీ నిర్వహించారు. స్థానిక ఆర్డీవో కార్యాలయం వద్ద వారంతా తమను ఆదుకోవాలంటూ నినాదాలు చేశారు. అనంతరం ఆర్డీవో కార్యాలయంలో సిబ్బందికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ జిల్లా నేత దొరబాబు మాట్లాడుతూ భవన నిర్మాణ కార్మికుల సంక్షేమబోర్డు ద్వారా అమలు కావాల్సిన పథకాలను సక్రమంగా అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న అన్ని పథకాలను భవన నిర్మాణ కార్మికులకు వర్తింపజేయాలన్నారు. సంక్షేమ బోర్డులో చేరిన ప్రతి కార్మికుడికి 55 సంవత్సరాల వయస్సు దాటితే నెలకు రూ.5 వేలు పింఛను ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఏఐటీయూసీ నేతలు అప్పలరాజు, దేవుడుబాబు, కన్నబాబు, వీరాచారి, వియ్యపురాజు, చొప్పా కోటి, ఒమ్మి సూరిబాబు, నరాలశెట్టి సత్యనారాయణ, సాయి, సతీష్, జస్వంత్, శ్యామ్,అప్పారావు, తాతలు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య అందించే బాధ్యత ఉపాధ్యాయులదే


శిక్షణలో మాట్లాడుతున్న మాణిక్యం

తుమ్మపాల: విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించే బాధ్యత ఉపాధ్యాయులపై ఉందని జిల్లా విద్యాశిక్షణ సంస్థ ప్రిన్సిపాల్ యు.మాణిక్యం అన్నారు. వేసవి సెలవుల అనంతరం బాధ్యతలు చేపట్టిన ఉపాధ్యాయులతో జేఎంజే పాఠశాలలో ఇండక్షన్ శిక్షణ శిబిరంలో ఆయన మాట్లాడారు. విద్యార్థుల ఉన్నతే లక్ష్యంగా ఉపాధ్యాయులు పని చేయాలన్నారు. ప్రభుత్వ పాఠశాలల విద్యార్థుల విద్యాభివృద్ధికి, సంక్షేమానికి ప్రభుత్వం అనేక కార్యక్రమాలు చేపడుతుందన్నారు. వాటిని సమన్వయం చేసుకుంటూ విద్యార్థులకు నాణ్యతగల బోధన అందించాలని చెప్పారు. శిక్షణ కోర్స్ కో ఆర్డినేటర్లు, జిల్లా విద్యాశిక్షణ సంస్థ అధ్యాపకుడు గొట్టేటి రవి మాట్లాడుతూ ఉపాధ్యాయులు విద్యార్థుల భవిష్యత్ తీర్చిదిద్దడంలో కీలకపాత్ర పోషించాలన్నారు. ఐదురోజుల పాటు జరిగే తెలుగు, ఆంగ్లం, పరిసరాల విజ్ఞానం, గణితం, డిజిటల్ విద్య, జనరల్ సబ్జెక్టులపై జరిగే ఈ శిక్షణకు విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాల నుంచి 250 మంది ఉపాధ్యాయులు, రిసోర్స్‌పర్సన్లు హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో డైట్ అధ్యాపకుడు జీజీఎస్ నాగేశ్వరరావు, జేఎంజే పాఠశాల ప్రిన్సిపాల్ సిస్టర్ మంజుల, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.